క్రీడలతో మానసికోల్లాసం

ఏసీపీ కిషన్
జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


మాట్లాడుతున్న ఏసీపీ కిషన్, నాయకులు

చేవెళ్ల: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఏసీపీ కిషన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద వార్డులో శనివారం రెండురోజుల పాటు జరిగే 6వ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏసీపీ, సీఐ భూపాల్‌శ్రీధర్, స్థానిక నాయకుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువతకు ఇలాంటి టోర్నమెంట్‌లో ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ పోటీలతో క్రీడాకారుల ప్రతిభ మెరుగుపడుతుందన్నారు. దామరగిద్దలో ప్రతి ఏటా వాలీబాల్ టోర్నమెంట్‌లు నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. జిల్లాస్థాయిలో రెండురోజుల పాటు రూరల్ విభాగం, ఓపెన్ టూ ఆల్ అనే రెండు విభాగాలు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రూరల్ విభాగంలో విజేత జట్టుకు 30వేలు, ద్వితీయ బహుమతి 20వేలు, తృతీయ బహుమతి 10వేలు, ఓపెన్ టూ ఆల్ విభాగంలో విజేత జట్టుకు మొదటి బహుమతి 50వేలు, రెండో బహుమతి 30వేలు, తృతీయ బహుమతి 20వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, మధుసూదన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, ప్రతాప్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, అంజయ్య, నిర్వాహకులు పవన్, ప్రకాశ్, ప్రసాద్, నరేందర్, నవీన్, గ్రామస్తులు, క్రీడాకారులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి మహిళలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, అధికారులు

శంకర్‌పల్లి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి మహిళలకు వరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపాలిటీ, మండలానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 46 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్, ఎంపీడీఓ వెంకయ్య, నాయకులు కొశెట్టి చంద్రమోహన్, ప్రవీణ్, చంద్రమౌళి, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, ప్రశాంత్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సమ్మిళిత వేడుక ఉగాది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఉగాది పండుగ ప్రకృతి సమ్మిళితమైన వేడుక అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని గ్రేడ్ 1 గ్రంథాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. శుభాలతో జీవితాన్ని శోభాయమానం చేసేందుకు కొత్త సంవత్సరం అడుగిడబోతుందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉగాదికి పంచాంగ శ్రవణం ఎంత ముఖ్యమో కవి సమ్మేళనం అంతే ముఖ్యమన్నారు. ఉగాది ఉషస్సులు విరబూయాలని, సమసమాజ స్థాపనకు నడుం బిగించాలని, అసమానతలు తొలిగిపోవాలని, భిన్నత్వంలో ఏకత్వమై సాగాలని ఈ సందర్భంగా కవులు తమ కవితలు వినిపించారు. అనంతరం సమ్మేళనంలో పాల్గొన్న కవులను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, తాండ్ర విశాల, బండారి రమేశ్, వెంకట్‌రాంరెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి, నక్కబాల్‌రాజ్, గంగిరెడ్డి, మాధవులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల దందాను అరికట్టాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంవత్సరానికి ముందే ప్రైవేట్ పాఠశాలల ప్రవేశాల దందాను అరికట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ కోరారు. శనివారం ఆయన జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తున్నాయన్నారు. స్థానికంగా ఉండే ఎంఈఓలకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవటం లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం వహించే ఎంఈఓలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలకు పూర్తిస్థాయిలో అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా నడుపుతున్నారని, వీటిపై మొదట్లోనే విద్యాశాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్

మొయినాబాద్: విద్యాసంవత్సరం పూర్తి కాకముందే అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఫీజుల దందా చేస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ల పేరుతో దందా నిర్వహిస్తున్నా జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో వచ్చే విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యా సంస్థలకు కనీసం అనుమతులు లేవని, దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్ల పేరుతో దందా చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు చరణ్‌గౌడ్, నాయకులు రేశ్వంత్, సాయికిరణ్, దిలీప్, అనిల్, రామ్‌చరణ్ ఉన్నారు.

చెక్కుల పంపిణీ

కేశంపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు తహసీల్దార్ అజాంఅలీ కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, రమేశ్, పెంటయ్య, కోడూరు రాములు, ఆర్ఐ నివేదిత పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్నులు చెల్లించొచ్చు

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్: సెలవు రోజుల్లోనూ ఇంటి పన్ను, ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ తెలిపారు. ఉగాది, రంజాన్ సందర్భంగా ఆదివారం, సోమవారం సెలవు ఉందని, పన్ను చెల్లింపునకు ఈ నెల 31 చివరిరోజు కావడంతో మున్సిపల్ కార్యాలయంలో పన్నుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడ్డీపై 90శాతం రాయితీ

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో 2024–25 సంవత్సరానికి గాను ఆస్తి పన్ను బకాయిలు ఉన్నవారు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ 90శాతం మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ యోగేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకొని, మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సెలవు దినాల్లో సైతం మున్సిపల్ కార్యాలయంలో పన్ను వసూలు చేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉండనున్నట్లు స్పష్టం చేశారు.

నిర్మాణాలపై తాపీమేస్త్రీలకు శిక్షణ

కేశంపేట: నిర్మాణాలపై తాపీ మేస్త్రీలకు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన పోలేపోగు శేఖర్, సాయిలు వెళ్లారు. శిక్షణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మెలకువలను వివరించారని వారు పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ చాంప్లానాయక్ ధ్రువపత్రాలను అందించారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

చేవెళ్ల: భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్‌మాదిగ అన్నారు. గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పౌరహక్కుల గురించి అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో ప్రజల మధ్యలో ఉన్న వివక్షత, అసమానతలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

మున్సిపల్ వేలం రూ.15.75లక్షలు


వేలంలో పాల్గొన్న పోటీదారులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో 2025–26 సంవత్సరానికి గాను శనివారం మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అధ్యక్షతన వేలం నిర్వహించగా పలువురు పాల్గొని, తైబజార్‌ని దక్కించుకునేందుకు పోటీపడ్డారు. చివరగా వేలం పాటలో మాచర్ల మమత రూ.15లక్షల 75వేలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. గతేడాది రూ.15లక్షల 50వేలకు పోగా ఈ సారి రూ.25వేలు అధికంగా రావడం గమనార్హం. ఈ మేరకు వేలం పాటలో తైబజార్ దక్కించుకున్న మమతకు కమిషనర్ యోగేశ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, సిబ్బంది వీరకుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జేపీదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీదర్గాను శనివారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మతసామరస్యాలకు జేపీదర్గా ప్రతీకగా నిలుస్తోందన్నారు. బాబా దర్శనం కోసం ముస్లింలతో పాటు హిందూవులు కూడా అధిక సంఖ్యలో వస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, దర్గా పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బీజేపీ నాయకుడు నీలకంఠం


దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరిచేరవని బీజేపీ మండల నాయకుడు నక్కలపల్లి నీలకంఠం అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో హైదరాబాద్‌లోని దోమలగూడలో గల ఏవీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చేపట్టిన జాతీయ కార్యక్రమం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామంలోని దేవాలయ పరిసరాలు, పాఠశాలల పరిసరాల్లో చెత్తచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో నీలకంఠం పాల్గొని విద్యార్థులతో శ్రమదానం చేశారు. అనంతరం విద్యార్థులు సామూహిక యోగా, వ్యాయామం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి అంజయ్య, గ్రామ నాయకులు నిరంజన్‌గౌడ్, భగత్‌రెడ్డి, అర్జున్, మధు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం

జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి


రోడ్డును పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని ఎన్టీఆర్ కుటీరం నుంచి గండిపేట చౌరస్తా వరకు సీసీరోడ్డు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన డీఈఈ విజయ్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ విద్యాసంస్థల గేటు నుంచి గండిపేట చౌరస్తాలో గల మెలువా ఇంటర్నేషనల్ పాఠశాల వరకు ఉన్న మట్టి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి 4.10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. 7.5 మీటర్ల వెడల్పుతో రెండు కిలోమీటర్ల పొడవునా రోడ్డును నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించామని వివరించారు. త్వరలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేతో చర్చించి రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చే రెండు సంవత్సరాల్లో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మంజులరవియాదవ్, కాంట్రాక్టర్ సైదులురెడ్డి, మున్సిపల్ అధికారి సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు కంటి అద్దాలు పంపిణీ


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సీఐ భూపాల్‌శ్రీధర్, వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్లలో ఇటీవల డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరంలో కంటిపరీక్షలు చేయించుకున్న వారికి శనివారం కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ భూపాల్ శ్రీధర్ హాజరై ప్రజలకు అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయటంతో పాటు అవసరమైన కంటి అద్దాలను సైతం ఉచితంగా అందించేందుకు ముందుకు రావటం సంతోషకరమన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చిన వైభవ్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, మాజీ సర్పంచ్‌లు జహంగీర్, నర్సింలు, గ్రామస్తులు ఉన్నారు.

సీసీ కెమెరాలకు విరాళం

ఊరేళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ రూ.1లక్ష విరాళం అందజేశారు. గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరైన సీఐ భూపాల్‌శ్రీధర్‌కు గ్రామస్తుల సమక్షంలో చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, వితలయ్య ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎంపీడీఓ బన్సీలాల్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ప్రజలు వేసవి కాలంలో దాహర్తిని తీర్చుకునేందుకు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో గ్రామ పంచాయతీ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఈ చలివేంద్రాన్ని ఎంపీడీఓ బన్సీలాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, అంబ భవానిమాత దేవాలయ చైర్మన్ ముత్యాలరాజు, ఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ నారందినేశ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్

కేశంపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తుందని చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో మహాజన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఖర్చులు, రాబడులను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతుల కోసం ఫర్టిలైజర్‌ను అందుబాటులో ఉంచామని, పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మఠం చంద్రశేఖర్, మధుసూదన్‌గౌడ్, పల్లాటి కృష్ణయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

ఏపీఎం శోభారాణి


కేశంపేట: మానవ అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అజాంఅలీ, మహిళలు

చేవెళ్ల: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం శోభారాణి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం వీఓ అధ్యక్షులు, వీఓఏలకు మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే 1930, 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. అమ్మాయిలు ఫోన్‌లో పరిచయం అయినవారిని నమ్మకుడదని సూచించారు. గ్రామాల్లో మహిళలు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత,సంఘాల సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: సమాజంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ అజాంఅలీ అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో శనివారం మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణాపై గ్రామ సంఘం మహిళా అధ్యక్షురాళ్లకు, గ్రామ సంఘం సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల్లో తీవ్రంగా ఉందని, ప్రతి పది నిమిషాలకు ఒక్క వ్యక్తి అక్రమ రవాణాకు గురవుతున్నట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా దత్తత తీసుకోవడం, అవయవ వ్యాపారం చేయడం నేరమన్నారు. ఆన్‌లైన్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏపీఎం భగవంతు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కోశాధికారి గీత, సీసీలు రాంచంద్రయ్య, మల్లేశ్, తిరుపతమ్మ, నర్సింహ, సమాఖ్య సిబ్బంది కవిత, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

కొందుర్గు: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై రవీందర్‌నాయక్ సూచించారు. శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం జయమాలిని ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాను ఎలా అరికట్టాలనే అంశంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై హాజరై మానవ అక్రమ రవాణా అరికట్టే విషయంలో మహిళల పాత్రను వివరించారు.

ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు


చేవెళ్ల: విద్యార్థులకు పచ్చడి అందిస్తున్న ఉపాధ్యాయుడు


అమ్డాపూర్‌లో పచ్చడిని గ్రామస్తులకు అందిస్తున్న విశ్వకర్మ సంఘం సభ్యులు

చేవెళ్ల: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను శనివారం చేవెళ్లలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ఒకరోజు ముందుగానే జరుపుకున్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో వచ్చి ఉత్సాహంగా వేడుకను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఉగాది పచ్చడిని తయారుచేసి అందరికీ అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉగాది పచ్చడి అంటే తీపి, పలుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచుల మిశ్రమం. జీవితం ఆనందం, విచారం, కోపం, అసహ్యం, భయం, ఆశ్చర్యంలను సూచిస్తోందని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి మల్లేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్, అంజనేయులు, ప్రవీణ్, రబీయా, షాహినా, కాశి, జగదీశ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ముందురోజే జరుపుకోవడం ఆనవాయితీ

మొయినాబాద్‌రూరల్: తెలుగు సంవత్సరం ఉగాది సందర్భంగా విశ్వకర్మ సంఘం సభ్యులు ఒక రోజు ముందు పచ్చడి చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని మండల విశ్వకర్మ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల నర్సింహాచారి అన్నారు. ఈ సందర్భంగా శనివారం అమ్డాపూర్ గ్రామంలో సంఘం సభ్యులు ఉగాది పచ్చడి తయారుచేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పలువురు విశ్వకర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య కార్యాచరణను విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొందుర్గు: సామాజిక న్యాయం కోసం దళిత ప్రజాసంఘాల నాయకులు, మేధావులు ఒక వేదికపైకి రావాలని డీఎస్పీ మండల కన్వీనర్ డప్పు రవీందర్ అన్నారు. ఇందుకోసం ఈ నెల 31న హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐక్య కార్యాచరణ వేదిక ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. హైద్రాబాద్‌లో నిర్వహించే ఐక్య కార్యాచరణ వేదికకు అందరూ హాజరై మేధావులు, నాయకులు తమ సలహాలు, సందేశాలను వివరించి, రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందాల్సిన హక్కులను కాపాడుకునే విధంగా సహకరించాలని కోరారు. అన్ని గ్రామాల నుంచి పార్టీలకతీతంగా కార్యకర్తలు ఈ కార్యక్రమానికి కదిలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ధ్రువపత్రాలను వెంటనే జారీ చేయాలి


తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పత్రాలను జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తహసీల్దార్‌కు సూచించారు. ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ పార్థసారధిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపాల కారణంగా సర్వర్ సరిగా పనిచేయడం లేదని, దీంతో ధ్రువపత్రాల జారీ ఆలస్యం అవుతుందని తహసీల్దార్ ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. సర్వర్ సమస్యను వెంటనే పరిష్కరించి దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను వెంటనే అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.